

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నల్గొండ యాదాద్రి సూర్యాపేట

శనివారం 03, మే 2025 పేజీలు - 8


విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ...

# ప్రజలకు సేవలు అందించిన మధుసూదన్ రెడ్డి

**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**





***నల్గొండ జిల్లా బ్యూరో***

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూనే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పని చేస్తూ తన అధికారిక సహాయకుడిగా తనతో పాటు ప్రజలకు సేవలు అందించిన మధుసూదన్ రెడ్డి సేవలు అభినందనీయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

మిగతా 2లో



తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ రావు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా॰నరసింహా చార్యులు, పాల్గొన్నారు.

**పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్**

# బ్యాంక్ సహకారానికి ప్రభుత్వం కృషి

**రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ, టెక్స్ టైల్స్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**పోచంపల్లి అర్బన్ బ్యాంక్ కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే**



భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సహాయ సహకారాలకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ, టెక్స్ టైల్స్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని తెలంగాణరాష్ట్ర వ్యవసాయ సహకారశాఖ, టెక్స్ టైల్ శాఖా మంత్రి తమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రారంభోత్సవానికి ఆయనతోపాటు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు , చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ఆర్డీవో శేఖర్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటిక్ అర్బన్ బ్యాంక్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మదన గోపాల స్వామి హాజరయ్యారు.

మిగతా 2లో

## ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై

# జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని 28 జిల్లాలలో ఎంపిక చేసిన 28 పైలట్ మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి**

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**






***ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో***

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్దిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి లబ్దిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలని అలాగే ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. శుక్రవారం అయన హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాబితాలో ఎవరైనా అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేస్తామన్నారు. లిస్ట్-1, లిస్ట్-2, లిస్ట్-3లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు. గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు పైలెట్ మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని తెలిపారు. ప్రతి మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేయాలని, స్థానిక తహసిల్దారును ఒక బృందంలో, మరో తహసిల్దారును ఇంకొక బృందంలో ఏర్పాటు చేయాలని, మొత్తం ఒక గ్రామంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ఉండాలన్నారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించి ముందుగానే గ్రామంలో దరఖాస్తు ఫారాలను ఇవ్వాలని, గ్రామాలను సందర్శించే సమయంలో సంబంధిత గ్రామ రికార్డులన్నింటిని బృందాలు వెంట తీసుకువెళ్లాలని, అలాగే హెల్ప్ డెస్కల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పైలట్ మండలాల్లో

మిగతా 2లో

# ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

**- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**- నిజమైన నిరుపేద లబ్ధిదారులను ఎంపిక చేయాలి**



మునుగోడు, మేజర్‌న్యూస్ : ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలనీ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. శుక్రవారం మునుగోడు నియోజకవర్గంలో గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారం, చేపటాల్సిన అభివృద్ధి పనులు, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై నల్గొండ యాదాద్రి జిల్లాకు చెందిన డిపిఓలు, డిఎల్పిఓలు, నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులు, మునుగోడు నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి మునుగోడులోని అధికారిక క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా వుండే విదంగా, సరైన త్రాగు నీరు అందించే విదంగా, గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించే విదంగా ఇక్కడి నుండే మార్పు మొదలు కావాలనీ కోరారు. పంచాయతీ కార్యదర్శుల పని వేళలు ప్రాక్టికల్‌గా ఉండాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలో పనిచేసే ప్రతి పంచాయతీ కార్యదర్శి ఉదయం 9 గంటల నుండి 5 గంటల వరకు గ్రామ పంచాయతీలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్ణయించారు. గ్రామాలలో చెత్త సేకరణ, మురుగు కాలువలు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సరిగా పని చేయడం లేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనసా, వాచ, కర్మణా కమిట్మెంట్‌తో ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. గ్రామాలలో అక్రమ నిర్మాణాలకు, అడ్డగోలుగా అనుమతులు ఇవ్వకూడదని ఆదేశించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే అంశాలకు సంబంధించి ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి కార్యక్రమాలు చేపట్టాలనీ పిలుపు నిచ్చారు.అందరి సహకారంతో మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్మూలనపై ఏ రకంగా ఉద్యమం చేసి తగ్గించామో, ప్లాస్టిక్ నిర్మూలనకు కూడా అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా స్వచ్ఛ మునుగోడు కార్యక్రమాన్ని తీసుకొని డ్రైవ్ చేపట్టాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఏడు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు.క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానాని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బందికి రెగ్యులర్‌గా జీతాలు వస్తున్నాయి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య నేతలు, యాదాద్రి, నల్గొండ జిల్లాల డిపిఓలు, డిఎల్‌పిఓ లు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవలు అందించిన మధుసూదన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వద్ద అధికారిక సహాయకుడిగా పనిచేస్తూ ఏప్రిల్ 30 న పదవీ విరమణ పొందిన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మధుసూధన్ రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎం.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వ సర్వీస్ నుండి పదవి విరమణ పొందిన మధుసూదన్ రెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన సహాయకుడిగా ఉంటూ ప్రజలకు సేవ చేస్తూనే తన ఉద్యోగ ధర్మానికి కూడా న్యాయం చేకూర్చిన మధుసూదన్ రెడ్డి సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి భార్య జ్యోతి, కూతురు శ్రీనిధి, జిల్లా పరిషత్తు సీఈఓ ప్రేమకరర్రెడ్డి ఉన్నారు.

# ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవా ఉత్సవం



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రం లో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం శుక్రవారం ఆలయంలో నిత్య పూజలతో పాటు సంప్రదాయ పర్వాలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభులకు ఆస్థాన పరంగా పూజించిన తదుపరి సాయంత్రం వేళ ఆండాళ్ అమ్మవారి ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్ది ఉంజల్ సేవా ఉత్సవాన్ని చేపట్టారు. ముత్యాల పల్లకి పై అలంకృత అయిన అమ్మవారిని ఆరాధిస్తూ పూజారులు హారతి నివేదించారు. ఆస్థాన విద్వాంసులు సన్నాయి రాగాలు డోలు వాయిద్యాలు మేళతాళాల తో సంకీర్తనలు పలికించి అమ్మవారికి నివేదన సమర్పించారు. ప్రధాన ఆలయంలో శుక్రవారం పురస్కరించుకొని ఆండాళ్ అమ్మవారి ఉంజల్ సేవ మహోత్సవం ఆలయ అర్చకులు నిర్వహించారు.

# జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. భూభారతి అవగాహన సదస్సులలో రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల అరవై వేల మంది రైతులు, ప్రజలు పాల్గొన్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టాఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు. ఈనెల 4న నిర్వహించనున్న నీట్ పరీక్షకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. నీట్ పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరుతోపాటు, ఓఆర్ఎస్ ప్యాకట్లు, మెడికల్ కిట్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జీరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని, జిల్లా యంత్రాంగం వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని నీట్ పరీక్ష సజావుగా నిర్వహించాలని చెప్పారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సూచనలను ముందుగానే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, సి.సి.ఎల్.ఎ డైరెక్టర్ మకరంద్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి, వి.పి. గౌతమ్, లా అండ్ ఆర్డర్ డిఐజి మహేష్ భగవత్ పాల్గొనగా జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఇంచార్జ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ్, అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, అదనపు ఎస్పీ రమేష్, నల్గొండ ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, నీట్ నోడల్ అధికారి శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు.

# పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సహకారానికి ప్రభుత్వం కృషి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్ బ్యాంకు సాధించిన ప్రగతి, అందిస్తున్న సేవలను వారికి వివరించారు. అనంతరము బ్యాంకు ఆవరణలో చైర్మన్ తడక రమేష్ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు సహకారవ్యవస్థ పటిష్టత కొరకు అందిస్తామని హామ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు బ్యాంకు సేవలను విస్తరించాలని సూచించారు. పోచంపల్లి బ్యాంకు ఎన్ పి ఏ జీరో శాతాన్ని బట్టి బ్యాంకు పటిష్టతను అర్థం చేసుకోవచ్చుని పేర్కొన్నారు. బ్యాంకు ఇప్పటికీ 400 కోట్లతో ఉండడం చాలా గొప్ప విషయమని అన్నారు .ఖాతాదారులకు బ్యాంకు ఇస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తడక వెంకటేశం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ ,పట్టణ అధ్యక్షుడు భారత లవ కుమార్, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, మర్రి నరసింహారెడ్డి,బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం,ఏలె హరిశంకర్, సూరిపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహ, స్థానిక సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 40 ఏళ్లుగా ఉంటున్నాం న్యాయం చేయండి



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : గత 40 సంవత్సరాలుగా కూరగాయల ఈరమ్మ వీధిలోని ఇంటిలో నివాసం ఉంటున్నామని, ఆ ఇంటిపై తమకు హక్కులు ఉంటాయని ఆ ఇంటిలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ ఇంటి యజమానులు ఆ ఇంటి నుండి తమను ఇప్పుడు అర్ధాంతరంగా ఖాళీ చేయమనడం సమంజసం కాదని అన్నారు. తమను బలవంతంగా ఖాళీ చేయించేందుకు తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. తాము గత 40 సంవత్సరాలుగా ఆ ఇంటిలో నివాసం ఉంటూ ఇంటికి సంబంధించిన నీటి బిల్లులు, కరెంటు బిల్లులు ఇతర అన్ని రకాల బిల్లులు కడుతున్నామని తెలిపారు. ఆ ఇంటిపై తమకు చట్టపరంగా హక్కులు ఉంటాయని అన్నారు. ఈ విషయమై ఇప్పటికే తాము కోర్టుకు వెళ్ళామని చట్టపరంగా తమ హక్కుల కోసం పోరాడుతున్నామని తెలిపారు. ఇటువంటి సమయంలో తమపై దౌర్జన్యపూరితంగా వారు తమరు ఆ ఇంటి నుండి వెలగొట్టేందుకు ప్రయత్నించడం సరి అయింది కాదని అన్నారు. చట్టపరంగా తమ హక్కుల కోసం కోర్టులో పోరాడుతామని ఆ ఇంటిపై తమకు చట్టపరంగా హక్కులు ఉంటాయని తెలిపారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ హనుమాన్, సంధ్య, గణేష్, స్వప్న, సతీష్, లావణ్య, చందూలాల్, రజిత, రామ్ లాల్, శిరీష, మోతిలాల్ సుమారు 10 కుటుంబాలు ఉన్నాయి.

# 5 నెలల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలి

## రాష్ట్ర ప్రభుత్వం మొదటి డైరీ 50 కోట్ల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలి

భువనగిరి, మేజర్‌న్యూస్ : తెలంగాణ పాల రైతుల సంఘం బోనస్ చెల్లించి, ఐదు నెలల బకాయి బిల్లు వెంటనే చెల్లించి, రాష్ట్ర ప్రభుత్వం మొదటికి 50 కోట్లు రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని, రాష్ట్ర కన్వీనర్ మంగ నరసింహులు, కో-కన్వీనర్ పెసరకాయల జంగారెడ్డిలు కోరారు. శుక్రవారం హయత్ నగర్ లోని మదర్ డైరీ సంస్థలో చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మదర్ డైరీ సంస్థ ఐదు బిల్లులు పెండింగ్‌లో ఉంచి పాడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు. నష్టాలకు కారణం రైతులు కాదని, పాలకవర్గాలు చేసిన తప్పిదాలే దీనికి కారణమని అన్నారు. పాడి రైతుల కష్టార్జితంతో కూడబెట్టిన ఆస్తులను అమ్మొద్దని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బోనస్‌ను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా లీటర్ పాలకు ఐదు రూపాయలు ఇన్సెంటివ్ రైతుల ఖాతాల్లో వేయాలన్నారు. ప్రతి పది రోజులకు ఓసారి పాల బిల్లులు చెల్లించాలని, ప్రైవేటు పాల సేకరణను నియంత్రించి పాల రైతులకు నష్టం జరగకుండా పాల ధరలను పెంచి మదర్ డైరీ సంస్థను కాపాడుకోవాలని అన్నారు. పాడి పశువులకు దాన 50% సబ్సిడీపై ఇవ్వాలి, గడ్డి కోసే యంత్రాలను 80 శాతం సబ్సిడీపై ఇవ్వాలన్నారు. పాడి పశువులకు, పాడి రైతులకు భీమా సౌకర్యం కల్పించి ఆ బీమా మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. భూమిలేని వారికి, వ్యవసాయ కార్మికులకు 90 శాతం సబ్సిడీపై పాడి పశువులను పంపిణీ చేయాలని అన్నారు. పశువుల కొట్టం నిర్మాణానికి రెండు లక్షల రూపాయల సబ్సిడీ ఇవ్వాలని అన్నారు. పాల రైతులకు మూడు లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మధుసూదన్ రెడ్డి పాల రైతు నాయకులు బి.మహేందర్ రెడ్డి, కే.శివరామిరెడ్డి, బండి నాగయ్య, సందిల భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మునుగోడు మండలం ఇంచార్జి తహసీల్దార్‌గా నేలపట్ల నరేష్



మునుగోడు, మేజర్‌న్యూస్ : మునుగోడు మండలం ఇంచార్జి తహసీల్దార్‌గా నేలపట్ల నరేష్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించినారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఏం.నరేందర్ కొండమల్లెపల్లి తహసిల్దార్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం మునుగోడు మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ ఇంచార్జి తహసిల్దార్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన నెలపట్ల నరేష్‌కి పలువురు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యల మీద ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తాననీ పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమను కలువచ్చని సూచించారు.

# బీజేపీ మునుగోడు మండల పార్టీ అధ్యక్షులుగా పెంబల్ల జానయ్య

### – మునుగోడు మండల అధ్యక్షులుగా రెండు సార్లు ఏకగ్రీవంగా ఎన్నిక
### – నికార్సైన బీజేపీ నాయకుడికి నిజమైన గుర్తింపు
### – హర్షం వ్యక్తం చేస్తున్న బిజెపి శ్రేణులు



మునుగోడు, మేజర్‌న్యూస్ : భారతీయ జనతా పార్టీ మునుగోడు మండల పార్టీ అధ్యక్షులుగా మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన పెంబల్ల జానయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ నియామకంతో రెండు సార్లు ఏకగ్రీవంగా ఎన్నికైన పెంబల్ల జానయ్యను మండల వ్యాప్తంగా పలువురు బిజెపి శ్రేణులు,పార్టీ నేతలు, నాయకులు,హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుని ఎన్నికైన పెంబల్ల జానయ్య విలేకరులతో మాట్లాడుతూ నామీద నమ్మకంతో రెండోసారి మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి, బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు మునుగోడు నియోజవర్గం ఇంచార్జీ గంగిడి మనోహర్ రెడ్డికి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నా నియామకానికి సహకరించిన మునుగోడు బిజెపి పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరంగా కష్టపడి పనిచేస్తానన్నారు. బీజేపీ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని రాబోయే స్థానిక సంస్థలే లక్ష్యంగా పని చేస్తానన్నారు. మండలంలో ఎక్కడ ఎక్కడ ఏమి అన్యాయం జరిగిన ప్రతి సమస్య మీద పార్టీ పక్షాన నాయకులతో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేస్తాననీ తెలిపారు.

# తెలంగాణ ఆచరించింది దేశం అనుసరిస్తుంది

భువనగిరి, మేజర్‌న్యూస్ : తెలంగాణలో జరిగిన కులగణన దేశానికి రోల్ మోడల్ అని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ ఘనత అని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ పులిగిల్ల బాలయ్య అన్నారు. భార త్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం కులగణన పూర్తి చేసింద అని, విదిలేని పరిస్థితిలో కేంద్ర క్యాబినెట్‌లో దేశ వ్యాప్తంగా కులగణనను ఆమోదించడం హర్షినీయం అని పులిగిల్ల బాలయ్య ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ తెలిపారు.

# ప్రారంభమైన వాలీబాల్ వేసవికాల క్రీడా శిక్షణ శిబిరం

### – వాలీబాల్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి:రావుల రమేష్



మునుగోడు, మేజర్‌న్యూస్ : మునుగోడు నియోజవర్గం ఘట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో మే 1 నుండి జూన్ 6 వరకు జిల్లా యువజన క్రీడా ప్రాధికా రిక సంస్థ నల్లగొండ ఆధ్వర్యంలో వెల్మకన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి కాల వాలీబాల్ ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గట్టుప్పల్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రావుల రమేష్ శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెల్మకన్నె గ్రామ పేరును జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీసుకెళ్లాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పరమేశం ద్వారా సీనియర్ క్రీడాకారుల ద్వారా మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. ఈ శిక్షణా శిబిరాన్ని వెల్మకన్నె గ్రామానికి కేటాయించినందుకు డివైఎస్ఓ కుంభం నర్సిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షులు రావుల ఎల్లప్ప మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా క్రీడాకారులు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారు కావాలని నేటి క్రీడాకారులు దేశానికి పట్టుకొమ్మలు అని తెలియజేశారు.

# ధాన్యం బస్తాలు నిండే... లారీలు రాకపాయే....?

### – అవస్థలు పడుతున్న కొనుగోలు సిబ్బంది
### – డబ్బులిస్తే వస్తాం లేదంటే రాం..?
### – నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న లారీ యజమానులు...?



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని పలు ధాన్యం కేంద్రాలకు లారీలు రావడానికి ససేమిరా అంటున్నారనీ ధాన్యం కొనుగోలు సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఎందుకు రారని కొనుగోలు సిబ్బంది ప్రశ్నిస్తే డబ్బులు ఇస్తే వస్తాం లేదంటే రాం అని అంటునట్లు విశ్వసనీయ సమాచారం. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లి అమ్ముకుందామంటే లారీలు సకాలంలో కొనుగోలు కేంద్రాలకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొనుగోలు కేంద్రాలలో ధాన్యం బస్తాలు నింపి రోజుల తరబడి ఎదురుచూడవలసి వస్తుందని కొనుగోలు సిబ్బంది,రైతులు నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.లారీల యజమానులు కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సహకరించడం లేదని వాపోతున్నారు. దీంతో వర్షం ఎప్పుడు పడుతుందోనని భయం భయంతో బిక్కు బిక్కు మంటూ గడపవలసిన పరిస్థితి ఏర్పడదని సిబ్బంది, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా జిల్లా మండల స్థాయి అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను సకాలంలో పంపించి సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు.ఇట్టి విషయంపై మండల ఇంచార్జి తహసీల్దార్ నెలపట్ల నరేష్‌ను వివరణ అడుగగా కొనుగోలు కేంద్రాలకు లారీ రావడం లేదని మా దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే లారీ అసోసియేషన్ సిబ్బందితో మాట్లాడినామని తెలిపారు. అసోసియేషన్ వాళ్లు పంపిస్తామని తెలిపారన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీ యజమానులు సహకరించకపోతే పై స్థాయి అధికారులకు పిర్యాదు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపామన్నారు. తహసీల్దార్ చెప్పిన సాయంత్రం వరకు లారీలు వెళ్లకపోవడం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం బస్తాలు ఉండటం గమనార్హం.

# ఎండి షర్ఫుద్దీన్ మృతి బాధాకరం

### భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గొడ్డటి శ్రీశైలం



చింతపల్లి, మేజర్‌న్యూస్ : తక్కలపెల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎండి. షర్ఫుద్దీన్ మృతి, అకాల మరణం బాధాకరమని నల్లగొండ జిల్లా భవన నిర్మాణ కార్మిక కమిటీ జిల్లా సభ్యుడు గొడ్డటి శ్రీశైలం అన్నారు. వారి కుటుంబానికి తక్కలపెల్లి గ్రామ కార్మిక సంఘం తరఫున ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు గొడ్డటి.శ్రీశైలం, కాసారం నరసింహ, ఏర్పుల వెంకటయ్య, జంగయ్య, భవన నిర్మాణ కార్మికులు, గ్రామ ప్రజలు, సర్పుద్దిన్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఉత్తమ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు



మునగాల, మేజర్‌న్యూస్ : నీటిపారుదల, సివిల్ సప్లై శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పై మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, మండల పార్టీ సీనియర్ నాయకులు గంగం సైదులు ఖండించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలపై మంత్రి జగదీశ్వర్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 8066 కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఇప్పటివరకు 153 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ లెక్కలు తెలియకుండా ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రాజకీయ లబ్ధి కోసమే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తూ తన గ్రాఫ్ ను పెంచుకొని ప్రయత్నించడం సరైనది కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఉధృతంగా ధాన్యం వస్తుందని వాటిని ఎప్పటికప్పుడు కాంటాలు వేస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా ఎగుమతి చేస్తుంటే జగదీశ్వర్ రెడ్డి కి కనబడటం లేదా అని ప్రశ్నించారు. రైతు ఖాతాలో కాంటలు వేసిన మూడు రోజుల్లోనే డబ్బులు వేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది అన్నారు ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు వీరబోయిన గురవయ్య, మామిడి వెంకట్రాం నరసయ్య, పనస శంకర్ పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే నా ప్రధాన లక్ష్యం

### – దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్



చింతపల్లి, మేజర్‌న్యూస్ : దేవరకొండ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే అధికారపు క్యాంపు కార్యాలయం నందు దేవరకొండ నియోజక వర్గంలోని పలు మండలానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన 205 మంది లబ్ధిదారులకు 68లక్షల 78వేల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం ఆర్ఎఫ్) చెక్కులను దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ సిఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరం అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే, ఎంపిల కార్యాల యాల వద్ద చెక్కుల కోసం పడిగాపులు కాచేవారని, నేడు లబ్దిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సహాయంతో లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామని అన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరఫున బాధ్యతగా నేరుగా ముఖ్య మంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం సహాయ నిధి పథకం ద్వారా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తూ, అర్హులైన పేదలకు న్యాయం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జరుగుతుందని అన్నారు. గత 10 సంవత్సరాల తెరాస పాలనలో తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రముగా మార్చి రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా నిరుపేదలకు అందించాల్సిన సీఎంఆర్ఎఫ్‌లో కూడా అవినీతికి పాల్పడిందని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రతి పేదవాడికి ఆదుకోవాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా మంజూరు చేసి, అందించిన సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలు మండలాల కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను స్వయంగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, దొంతం సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, ఎరుకల వెంకటయ్య, కొప్పుల అశోక్, కురుమేడు మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీశైలం, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారుడు శంకర్ మృతి పట్ల క్రీడాకారుల నివాళులు

హుజూర్‌నగర్‌రూరల్,మేజర్‌న్యూస్ః మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు తాళ్ల శంకర్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందడం జరిగింది. గ్రామానికి చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారులు షేక్ లాల్‌మదార్, యరగాని గోవిందు, షేక్ అలీ, గువ్వల నాగయ్య, కీర్తి వీరబాబు, గంధసిరి మిన్ను, తోకల సైదులు శంకర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## శ్రీ పద్మావతి అమ్మవారికి కుంకుమార్చన సేవ



భువనగిరి, మేజర్‌న్యూస్ : శుక్రవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని జగదాచార్యులైన భగవద్ రామానుజాచార్యులు 1008 తిరునక్షత్ర మహోత్సవంలో భాగంగా స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం శ్రీ సన్నిధి రామానుజాచార్య స్వామి వారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ వారి పాదాల వద్ద ఉన్న శ్రీ త్రోవ భాష్యకార రామానుజ స్వామివారికి కూడా అభిషేకం నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది.సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కొరకు సుదర్శన నరసింహ హవనం నిర్వహించారు. ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సువర్ణభరిత వజ్రాభరణాలతో, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామి వారి విశిష్ట కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 కు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య భక్తి గీతాలాపనలతో శ్రీ స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకలైశ్వర్య ప్రధాయిని అయిన శ్రీ పద్మావతి అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో,విశేష కుంకుమార్చన సేవ చేయడం జరిగింది.స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

## గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : తెలంగాణ ప్రభుత్వం బీసీ లకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు ఏప్రిల్ 8న గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపడంతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు,తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు.ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చింతపల్లి, మేజర్‌న్యూస్ : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని చింతపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం అన్నారు. శుక్రవారం దేవరకొండ క్యాంప్ ఆఫీసులో చాకలి శేరిపల్లి గ్రామానికి చెందిన బూడిద భారతమ్మ, కేశగోని పెద్ద మల్లయ్యకు ఎమ్మెల్యే బాలునాయక్ చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషన్, గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కేశగోని వెంకటేష్ గౌడ్, బూడిద సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ(ఎం)సీనియర్ కార్యకర్త మృతి



చిట్యాల, మేజర్‌న్యూస్ : నార్కెట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) పార్టీ సీనియర్ సభ్యుడు బోయపల్లి శంకరయ్య (60) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి జోహార్లు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిన మాజీ ఎంపిటిసి కుమ్మరి శంకర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరయ్య మరణం పార్టీకి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. తాను చిన్నతనం నుండి పార్టీ సభ్యునిగా కొనసాగుతూ అనేక ఉద్యమాలలో పాల్గొనేవారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు దండు రవి, బోల్లెదు సైదులు, శాఖ కార్యదర్శిలు దండు నాగరాజు, శ్రీను, కల్లూరి యాదమ్మ, సహాయ కార్యదర్శులు అంతటి సత్యనారాయణ, మాడగొని సైదులు, బొడ్డుపల్లి హుస్సేన్, భాష, ఏనుగుల శంకర్, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చుతున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి, మేజర్‌న్యూస్ : మోటకొండూర్ మండల కేంద్రానికి సంబంధించి నీటి ఎద్దడిని తెలుసుకొని బీర్లా ఫౌండేషన్ ద్వారా, వాటర్ పిల్టర్ మరియు అందుకు సంబంధించిన సామాగ్రిని గ్రామ ప్రజలకు శుక్రవారం నాడు అందజేసినారు. త్వరలో ఫిల్టర్ ను ప్రారంభించి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని,ఇట్టి దాహార్తిని తీర్చిన బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనితకు మరియు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపినారు.



# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయన్న




చిట్యాల, మేజర్‌న్యూస్ : ఈనెల 20న సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయన్న ఆశా వర్కర్లతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయకుమార్ కు సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు చేసి, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తుంది. కోడ్స్ అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుంది. ఉద్యోగ భద్రత ఉపాధి కోల్పోతారు కార్మిక శాఖ కూడా నిర్వీర్యం చేయబడుతుందని అన్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని కూడా ప్రైవేటీకరణ చేయాలని చూస్తుంది. ఆశా వర్కర్లకు నేటికి కనీస వేతనం నిర్ణయం చేయకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుంది. కాబట్టి తక్షణమే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఆశా వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని ఆశ వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయల అమలు చేయాలని, ప్రతి ఒక్క కార్మికుడు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుమ్మల నాగలక్ష్మి,ఆల్లె కరుణ, సిహెచ్ భాగ్య, ఆదిమల్ల పద్మ, పద్మ, మంగమ్మ,నరసమ్మ,వెంకటమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# గుర్రంపోడ్ తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాస్



గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : శుక్రవారము గుర్రంపోడ్ తహశీల్దార్‌గా పి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన జి.కిరణ్ కుమార్ ఫిబ్రవరిలో సస్పెండ్ కావడంతో అప్పటి నుంచి తహశీల్దార్ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇంచార్జీ తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్ మహ్మద్ ఫరీదుద్దీన్ అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో నల్లగొండ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాస్ బదిలీ పై వచ్చారు. ఆయనకు మండల సర్వేయర్ రాంనర్సయ్య, ఆర్ఎస్ఐ హకీం, ఏఎస్ సాలయ్య, జూనియర్ అసిస్టెంట్లు సందీప్, వెంకటకృష్ణ, గోవర్ధన్, యాదగిరి, రామకృష్ణ, శ్రీనివాస్, రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు నరేష్, శివ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# 100% ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం



మోత్కూర్, మేజర్‌న్యూస్ : మండలంలోని పొడిచెడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించడం పట్ల శుక్రవారం మాజీ సర్పంచ్ పేలపూడి మధు తోపాటు, అధ్యాపక బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. 510 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన సలిగంజి అజయ్ కుమార్‌ను, 501 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన ఓర్సు కావ్యను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ సంధ్యారాణి, ఏఏపిసి చైర్మన్ సబిత, ఉపాధ్యాయులు లింగస్వామి, ఉమాదేవి, కళ్యాణి, లక్ష్మారెడ్డి, సరోజ, సతీష్, ఉష, జ్యోతి, గ్రామస్తులు జిట్ట గౌతం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ బొడ్డు సత్తయ్య విగ్రహ ఆవిష్కరణ



చండూర్, మేజర్‌న్యూస్ : స్వర్గీయ అడ్వకేట్ బొడ్డు సత్తయ్య 3వ వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కేంద్రంలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన కాస్య విగ్రహాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వర్ధంతి సభలో మాట్లాడుతూ గొల్ల కురుమలకు అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు బడుగు లింగయ్య యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఆచ్చిన శ్రీనివాసులు యాదవ్, జక్కలి ఐలయ్య యాదవ్, మాజీ వైస్ మున్సిపల్ చైర్ పర్సన్ దోటీ సుజాత వెంకటేష్ యాదవ్, బూడిద లింగయ్య యాదవ్, నల్పరాజు రామలింగయ్య, మలిగ యాదయ్య, బొబ్బిలి గోపాలకృష్ణ, బొడ్డు శివలింగం యాదవ్, నల్ల మధు యాదవ్, ఆవుల బిక్షం యాదవ్. బొబ్బల స్వామినాథ్ యాదవ్, దోటి చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఎస్.సి ఫలితాల్లో సత్త చాటిన ఇండియా మిషన్ హైస్కూల్ విద్యార్థులు



భువనగిరి, మేజర్‌న్యూస్ : భువనగిరి పట్టణంలోని ఇండియా మిషన్ హైస్కూల్ విద్యార్థులు ఎస్ ఎస్ సి ఫలితాల్లో పట్టణంలో మంచి ఉత్తమ ఉత్తీర్ణత సాధించారని పాఠశాల కరస్పాండెంట్ రేవ ఎస్ జూడ శుక్రవారం తెలిపారు.పాఠశాల టాపర్ గా గొర్ల వర్షశ్రీ 564/600, కుక్కదువ్వ వైష్ణవి 552/ 600 మరి మధుప్రియ 528/600 మార్కులు సాధించారు. 27 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6మంది విద్యార్థులు 500మార్కులకు పైగా,14మంది విద్యార్థులు 400పైగా, 7మంది విద్యార్థులు 300పైగా ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాతో సత్కరించి అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ రేవా ఎస్ జుడా.ఈ సందర్భంగా కరస్పాండెంట్ జుడా మాట్లాడుతూ పాఠశాల స్థాపించి 35 సంవత్సరాల నుండి అనేకమైన విద్యార్థులను ఉన్నత స్థాయి తీసుకెళ్లినటువంటి ఘనత మా పాఠశాలకు దక్కుతుందని తెలిపారు.మీ పిల్లల భవిష్యత్తు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడానికి పాఠశాల సిద్ధంగా ఉందని, అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్న పట్టణంలో ఏకైక పాఠశాల ఇండియా మిషన్ హైస్కూల్ అని అన్నారు. కావున మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జార్జ్ జోసఫ్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ రామానుజాచార్యుల 1008వ జయంతి

## - డాక్టర్ వేమూరి సత్యనారాయణ



మునగాల, మేజర్‌న్యూస్ : మునగాల మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ రామానుజ చార్యుల విగ్రహానికి 1008వ జయంతి సందర్భంగా స్వామి వారికి. ఘనంగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన పూజా కార్యక్రమంలో గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారులు డాక్టర్ వేమూరి సత్యనారాయణ పూజా కార్యక్రమంలో శుక్రవారం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తమ ఇంటిపేరు వేమూరి వారి కులదైవం శ్రీ రామానుజాచార్యుల స్వామి వారి 1008వ జయంతి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని రామానుజాచార్యుల వారు విశిష్టాద్వైతమును ప్రసాదించిన గొప్ప తత్వవేత్త ఆస్తిక బ్రహ్మ యోగి అని త్రి మతాచార్యులలో ద్వితీయుడు కర్తవ్య దీక్షలో ప్రదర్శించవలసిన ధైర్యానికి దేవునిపై చూపవలసిన అనన్య సామాన్యమైన నమ్మకానికి సాటిలేని భక్తికి రామానుజాచార్యుల వారి జీవితం ఆదర్శమని ప్రస్తుతం సాంప్రదాయకంగా కొనసాగుతున్న ఆచార వ్యవహారాలు చాందసంగా మారి సామాజిక పురోగతికి అడ్డరాక మునుపే వాటిని గుర్తించి సమాజ శ్రేయస్సుకై వాటిని మానటమో మార్చటమో చేయటం బ్రాహ్మణుని లేదా ఆచార్యుని ప్రదమ కర్తవ్యం అని ఒక పని వల్ల పదిమందికి మేలు జరుగుతున్నప్పుడు తమకు కీడు జరిగిన పదిమందికి జరిగే మేలు కై తమ కీడును లెక్క చేయవలసిన అవసరం లేదు. సమాజ శ్రేయస్సు ముఖ్యం కానీ వ్యక్తి గత శ్రేయస్సు కాదు అని సమాజ హితం కోసం సనాతన ధర్మం కోసం పరితపించిన గొప్ప ఆధ్యాత్మిక వేత్త మానవాళికి గొప్ప ఆదర్శ మూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించి తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహాపురం గ్రామంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

# చట్టపరంగా మాకే హక్కులు ఉన్నాయి

## గొర్ల నిర్మల



యాదగిరిగుట్ట పట్టణంలోని కూరగాయల ఈరమ్మ వీధిలో గల ఇల్లు తమ సొంత ఇల్లు అని ఆ ఇంటిపై చట్టపరంగా అన్ని హక్కులు తమకే ఉన్నాయని గొర్ల నిర్మల తెలిపారు. తమ ఇంటిలో కొంతకాలంగా ఇతరులు అద్దెకు ఉంటున్నారని తెలిపారు. కానీ వారు ఇటీవల ఆ ఇంటి పై హక్కుల కోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కానీ వారికి తమ ఇంటిపై ఇలాంటి హక్కులు లేవని అన్నారు. ఈ విషయమై కోర్టుకు వెళ్ళగా తమకే అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చిందని తెలిపారు. దీంతో తాము తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారిని కాళీ చేయించేందుకు వెళ్లగా వారు దౌర్జన్యంగా తమపైకే తిరగబడుతున్నారని అన్నారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని తెలిపారు. తమ ఇంటిపై తమకే అన్ని హక్కులు ఉన్నాయని వారికి ఎలాంటి హక్కులు లేవని స్పష్టం చేశారు. చట్టపరంగా తమ ఇంటిని తాము స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

సూర్య
www.suryaa.com



# ర్యాంకర్ జీషాన్‌ని సన్మానించిన పింగల్ అన్న సేవాదల్ అధ్యక్షుడు



బీబీనగర్,మేజర్,న్యూస్ః బీబీనగర్ మండలకేంద్రానికి చెందిన ఎండి పర్వేశ్ కుమారుడు ఎండి జీషాన్ ఔషాపూర్‌లోని అల్ఫోర్స్ కాలేజీలో ఇంటర్ చదువుకొని ఇంటర్ ఫలితాల్లో 993 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించడంతో పాటు ఐఐటీ,జీఈఈ మెయిన్స్‌లో 99.8శాతంతో ఆల్ ఇండియా 1900 ర్యాంక్ సాధించినందుకు గాను శుక్రవారం పింగల్ అన్న సేవాదల్ అధ్యక్షుడు ఎండి మోయిన్ జీషాన్‌ని శాలువతో సన్మానించి,పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎండి మోయిన్ మాట్లాడుతూ ముస్లిం కమ్యూనిటీకి చెందిన విద్యార్థులు జీషాన్‌ని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో మంచి ర్యాంక్‌లను సాధించేలా ప్రయత్నం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎండి దస్తగిరి,ఖాజా మొయినుద్దీన్,సయ్యద్, బషీర్,మిస్బా,అజీమ్,నజీర్,నయిం,అక్బర్,అస్లాం,అదేవిధంగా జామ మజిద్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం




తర గతి పరీక్షా ఫలితాలలో మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల వారి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో పుట్లూరి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు దేశా భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా మందిరాలుగా నిలుస్తున్నాయి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక సౌకర్యాలు, విద్యావనరులు, వాటిని సమర్థంగా వినియోగిస్తున్న ఉపాధ్యాయుల అనుభవజ్ఞానం, అంకితభావం విద్యార్థులకు ప్రతిభను వెలిగించబోతుందన్నారు. పట్టుదలతో పాఠశాలలకు సేవ చే స్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకులు అవుతున్నారన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ప్రవణవి, కామల్ల చందుప్రియ, నిమిషకవి కీర్తనలు ద్వితీయ స్థానంలో నిలవడంతో ముగ్గురు విద్యార్థులకు కలిపి రూ.14వేల నగదు ప్రోత్సహకాలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అందచేడం జరిగింది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జిలకర్ర రామస్వామి, బట్టుమధు, ప్రిన్సిపల్ అనుకరణ, కొణతం సీతారామిరెడ్డి, గుండ్రెడ్డి సైదిరెడ్డి, షేక్ యూసూఫ్, రాచకొండ అంజయ్య, వీరమల్ల సత్యనారాయణ, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, ఉప్పల లక్ష్మారెడ్డి, విశ్వనాథం, వల్లూరి శ్రీనివాసరావు, మూలగుండ్ల వెంకట్‌రెడ్డి, బసవ కోటేశ్వరరావు, తక్కెలపల్లి నాగార్జున, ఉపాధ్యాయులు శౌరి, రషీద్,ఖాన్, నాగేష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# జాతర ఉత్సవాలపై అధికారులతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమీక్షా సమావేశం

మిర్యాలగూడటౌన్,మేజర్‌న్యూస్ః స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ అధ్యక్షతన శ్రీబంగారు మైసమ్మ తల్లి జాతర ఉత్సవాల ఏర్పాట్ల గురించి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్సీ లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, మిర్యాలగూడ డియస్పీ రాజశేఖర్‌తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ బంగారు మైసమ్మ తల్లి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ వేసవికాలంలో భక్తులకు దాహం తీర్చేందుకు పకడ్బంధీగా దేవాలయ ప్రాంగణంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కల్లేపల్లి ఆలయ పూజారులు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ జనార్ధన్, ఆలయ ఈవో కొండారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దస్రూనాయక్, నెహ్రు,, ఎర్రనాయక్, లింగనాయక్, ధీరావత్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కళాభారతికి కేసీఆర్ పేరు తొలగించడం పై బిఆర్ఎస్ శ్రేణుల నిరసన



మిర్యాలగూడటౌన్,మేజర్‌న్యూస్ ః నియోజకవర్గ కేంద్రంలో రూ.10 కోట్లతో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కళాభారతిని నిర్మించారు. ఈ కేసీఆర్ కళాభారతిని మిర్యాలగూడ నియోజకవర్గ కవులు, కళాకారులు, రచయితలు , సాంస్కృతిక పరులకు అంకితం చేస్తూ వారి కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సెంట్రల్ ఏసీతో నిర్మించి ఇచ్చారు. ఇట్టి కేసీఆర్ కళాభారతి పేరులో కేసీఆర్ పేరును స్థానిక పాలకుల సూచనతో మున్సిపల్ సిబ్బంది తొలగించడంతో ఈ విషయంపై భగ్గుమన్న బిఆర్ఎస్ శ్రేణులు,మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో అదే కేసీఆర్ కళాభారతి ముందు శుక్రవారం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 2006లో కళాభారతికి శంకుస్థాపన చేసిన కేసీఆర్ బిఆర్ఎస్ పాలన వచ్చే వరకు కనీసం 30 శాతం సనులు చేపట్టకుండా నిర్మించి అరికొర పనులు కూడా శిథిలావ స్థకు వస్తే తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి దీనిపై దృష్టిపెట్టి పలుమార్లు కేసీఆర్‌ను, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి ఈ ప్రాంత కళాకారుల పరిస్థితిని వివరించి పూర్తి నిర్మాణం చేపట్టి 2023 అక్టోబర్ 2న కేటీఆర్ అప్పటి జిల్లా మంత్రి జగదీశ్వర్‌రెడ్డిచే ప్రారంభించారు.ప్రభుత్వం మారినాక ప్రస్తుత పాలకులు చేయవలసిన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా కూల్చుడు, పేర్లు మార్పుపై ఆలోచిస్తున్నారని అన్నారు.అనంత రం మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో పాటు బిఆర్ఎస్ శ్రేణులు మున్సిపల్,సబ్ కలెక్టర్,డియస్పీ కార్యాలయాలలోని అధికారులకు వినతిపత్రం అందచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మరలా యధావిధిగా పేరు మార్చాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, యడవెల్లి శ్రీనివాసరెడ్డి,మోషిన్ అలీ, ధనావత్ చిట్టబాబునాయక్, బైరం సంపత్, ధనావత్ బాలాజీనాయక్, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదయ్య, మగ్ధూమ్‌పాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

హుజూర్‌నగర్‌రూరల్,మేజర్‌న్యూస్ః పట్టణంలోని బైపాస్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ గోదా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు ఆలయం నందు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ నూతన కమిటీ అధ్యక్షులుగా దేవరం అమృతారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా దేవరం మల్లీశ్వరీశ్రీనివాస్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, బెల్లంకొండ శ్రీనివాస్, చిట్టిప్రోలు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా తమ్మన సుజాత నాగేశ్వరరావు, జక్కుల మల్లయ్య, తేలుకంట్ల శ్రీనివాస్, కోశాధికారిగా చిల్లంచర్ల ఆనంద్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా పచ్చిపాల మల్లిఖార్జున్‌రావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రముఖులు, ప్రజల సహాయ,సహకారాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



# మౌన యుద్ధం మనిషి మిన్న

తిప్పర్తి, మేజర్‌న్యూస్ ః మనిషికన్నా మనిషి మాటకున్న విలువ మిన్న మనుషుల మధ్య మాటలకున్న విలువ మరీ మిన్న మనుషుల మధ్య మాట కరువైనపుడు శ్మశాన నిశ్శబ్దం రాజ్యమేలుతుందిపభ్రుత్వానికీ ప్రజలకూ మధ్య మాట కరువైనపుడు రాజ్యమే ఒక శ్మశానాన్ని తలపిస్తుంది– అవును! ఇప్పుడు కాశ్మీర్‌లో అదే జరుగుతోంది. ఉగ్రవాదానికి–కేంద్రానికి మధ్య అంటూ మొదలైన యుద్ధం ఇప్పుడు కేంద్ర పాలక పార్టీకి – కాశ్మీర్‌లోని ప్రజాస్వామ్య పార్టీలకూ మధ్య కేంద్రీకృతమైంది. ఫలితంగా కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ముగ్గురూ చెరసాలలో మగ్గుతున్నారు. భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగుని విపరీతమిది. తలచుకుంటేనే వొళ్లంతా జలదరించే అనూహ్యమైన అప్రజాస్వామిక పరిణామమిది. మరీ ముఖ్యంగా భారతదేశ జాతీయజెండా కాశ్మీర్‌లో సగర్వంగా ఎగిరేందుకు జీవితాంతం చావుకు ఎదురీది శ్రమించిన 81ఏండ్ల కురువృద్ధుడు, మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాను అరెస్టు చేయడం. ఫరూఖ్ అబ్దుల్లా విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పరమ దుర్మార్గమైనది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన ఆగస్టు 5 నుంచే ఫరూఖ్‌ను గృహనిర్బంధంలో ఉంచారు. ఆగస్టు 6న కేంద్ర హౌం మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రసంగిస్తూ ఫరూఖ్‌ను అరెస్టు చేయడం కానీ, నిర్బంధంలోకి తీసుకోవడం కానీ జరగలేదని నిస్సిగ్గుగా పచ్చి అబద్ధమాడారు. దీంతో తమిళనాడుకు చెందిన ఎండీఎంకే నేత వైగో ఫరూఖ్ ఎక్కడున్నారో చెప్పాలంటూ సుప్రీం కోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్ దాఖలు చేయడంతో ఆయనను అరెస్టు చేసినట్టు ప్రకటించారు.

సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే తరిగామితో సహా కాంగ్రెస్, నేషనల్ కాంగ్రెస్, పీపుల్స్‌డెమోక్రటిక్ ఫ్రంట్.. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములైన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలంతా ఇప్పుడు నిర్బంధంలో మగ్గుతున్నారు. ఇన్నాళ్ళూ కాశ్మీర్ ప్రజల గొంతుకగా ఉన్నవారు, వేర్పాటువాదుల నుంచి పొంచి ఉన్న ముప్పుకు బెదరకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వాళ్ళంతా జైళ్ళల్లో మగ్గుతున్నప్పుడు ఇక అక్కడ రాజకీయ ప్రక్రియకు తావెక్కడిది? దశాబ్దాలుగా రగులుతూ ఉన్న కాశ్మీర్ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు వీలెక్కడిది? అంటే, కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించేందుకు సిద్ధంగా లేదని మనకు అర్థమవుతున్న అంశం. మరి, రాజకీయ ప్రక్రియకు పూర్తిగా తలువులు మూసేసిన కేంద్రం ఇప్పుడు అక్కడ ఏమి చేయబోతోంది? మాటలకు (చర్చలకు) మార్గం మూసేసిన తరువాత ఏమి జరుగుతుంది? మరింతగా నిర్బంధం పెరుగుతుంది. మరిన్ని వేలమందిని జైళ్ళల్లో కుక్కేస్తారు. కాశ్మీర్‌లో జైళ్ళు చాలకపోతే దేశంలోని జైళ్ళన్నిటికీ కాశ్మీరీయులను తరలిస్తారు. నిజానికి ఇప్పటికే ఆ తరలింపు మొదలయ్యింది. ఇంటికొక్కరు, ఆ ఇంటిని పోషించాల్సిన అవసరం, శక్తి ఉన్నవాళ్ళు ఇంటికి దూరమైన తరువాత ఆ కుటుంబం, కుటుంబానికి దూరమై జైలులో ఉన్న వ్యక్తి డీలా పడిపోతాడనీ, తీవ్ర నిరాశలో, నైరాశ్యంలో కూరుకు పోతారనీ, ఎంత ప్రతిఘటించినా వ్యర్థం, అత్యంత బలమైన రాజ్యంతో ఢకోని తాము అనుకున్నది సాధించడం అసాధ్యమన్న నిర్ణయానికి వచ్చి సర్కారుతో రాజీ పడతారనీ, ఉన్న దాంతో సర్దుకుపోవడం అలవర్చుకుని అణగిమణగి పడిఉంటారనీ.. కేంద్రంలోని కాషాయ ప్రభుత్వం భావిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే కేంద్రంలోని బీజేపీ సర్కార్ కాశ్మీర్ ప్రజలపై మానసిక యుద్ధం చేస్తున్నదిప్పుడు. చుట్టూ నిశ్శబ్దాన్ని నింపి, నిశ్శబ్దంలో జనాన్ని నింపి, ఆ మాటలు లేని మౌన జీవితంతో జనం విసిగివేసారిపోయేలా చేసి లొంగదీసుకోవాలని చూస్తోంది.

కాశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పూర్తిగా సమర్థనీయమని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రకటించిన తరువాత ఇక ప్రజలకు ప్రత్యామ్నాయం ఎక్కడిది? తమకు జరుగుతున్న అన్యాయాన్ని, తమపై జరుగుతున్న దౌర్జన్యాన్ని జనం ఎక్కడికెళ్లి విన్నవించుకోవాలి? తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎవరిని వేడుకోవాలి? అలా విన్నవించుకునే, వేడుకునే అవకాశం లేకుండా చేయడమే నరేంద్ర మోడీ సర్కారు ఎత్తుగడ. ప్రత్యామ్నాయం కోల్పోయిన జనం అనివార్యంగా తాము చెప్పినట్టు వింటారని, తమ కాళ్ల చెంత పడి ఉంటారనీ కమలనాథుల నమ్మకం.

నిజమే! లోపల రగులుతున్న అగ్నిపర్వతం కూడా బద్ధలయ్యే వరకూ పైకి ప్రశాంతంగానే కనిపిస్తుంది. అంతమాత్రాన అది బద్దలయ్యేవరకు తనలోపల ఉన్న గుణాన్ని కోల్పోయినట్టు కాదు. ప్రజలూ అంతే. జీవితం తమలో రగిలించిన తిరుగుబాటు తత్వాన్ని ఆశయం సిద్ధించేంత వరకూ అస్సలు కోల్పోరు. ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో లోలోన అణచుకుంటారు. అదనుచూసి అగ్నిపర్వతమై బద్ధలవుతారు.

# నిజాయితీ నిరూపించుకోవాలి

మిర్యాలగూడ, మేజర్‌న్యూస్ ః యురేనియం తవ్వకాలపై ముఖ్యమంత్రి మూడ్రోజుల క్రితం నోరు విప్పారు. నల్లమలలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడా యురేనియం తవ్వకాలకు అనుమతీయబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉభయసభల్లో ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా సీఎం మరో అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రత్యేకరాష్ట్రం ఏర్పడ్డనాటి నుంచీ ఎవరికీ, ఏవిధమైన అనుమతులూ యివ్వలేదన్నారు. ఇక మీదట ఇవ్వబో మనీ తెలిపారు. ఆలస్యంగానైనా సీఎం స్పందించడం, ప్రభుత్వ వైఖరి చెప్పడం శుభపరిణామం. రాష్ట్రాన్ని చుట్టు ముట్టిన యురేనియం ముప్పుపై పోరు చేస్తున్న జనావళికి ఈ పరిణామాలు నైతికబలాన్నిస్తాయ నడంలో సందేహం లేదు. అదే సందర్భంలో ఇక అంతా రాష్ట్ర సర్కారే చూసుకుంటుందిలే.. అనే భ్రమలూ అక్కర్లేదని పర్యావరణ వేత్తలూ రాజకీయ విశ్లేషకులూ హెచ్చరిస్తున్నారు. అందుకని ఇప్పటికిప్పుడే ప్రభుత్వాన్ని అనుమానించలేం. కానీ ఆ వైపు సర్కారు నుంచి ఆచరణాత్మక అడుగులు అవసరం.

# నృసింహ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

## మీడియా సమావేశంలో ఈవో వెంకట్రావు



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం శ్రీ స్వామివారి నృసింహ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం ఆలయ ఈవో ఐఏఎస్ అధికారి వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. స్వస్తి శ్రీ విశ్వావసు నామ సంవత్సరం వైశాఖ శుద్ధ ద్వాదశి శుక్రవారం ఉదయం 8: 45 నిమిషములకు నృసింహ మూల మంత్ర భావనములు తేదీ: 9- -5- 2025 నుండి వైశాఖ శుద్ధ చతుర్దశి ఆదివారం తేదీ: 11- 5- 2025 వరకు మూడు రోజులపాటు శ్రీ స్వామివారి ప్రధానాలయము, అనుబంధాలయము, శ్రీ పాత గుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయము, యోగానంద లక్ష్మి నరసింహ స్వామి వారి దేవాలయం దబ్బగుంటపల్లి జయంతి ఉత్సవాలు అత్యంత వైభవముగా నిర్వహించుటకు ఏర్పాట్లు దావించబడుచున్నవి. ప్రధానాలయంలో కార్యక్రమాలు శుక్రవారం ఉదయం తేదీ. 9-05-2025 రోజున స్వస్తివాచనము విశ్వక్సేన పూజ పుణ్యాహ వాచనము రుత్విక్ మరణం లక్ష కుంకుమార్చన తిరు వెంకటపతి అలంకార సేవ శనివారం 10వ రోజున నిత్య నృసింహ మూలమంత్ర హవనములు, లక్ష పుష్పార్చన, కాళీయ మర్ధన అలంకార సేవ, ఆదివారం తేదీ 11వ రోజున నృసింహ హవవనములు, ఎనిమిది గంటల 30 నిమిషాలకు మహా పూర్ణాహుతి తదుపరి సహస్ర కలశాభిషేకము సాయంకాలము 7 గంటలకు విశేష తిరువారాధన, అర్చన వేద స్వస్తి, నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థ ప్రసాద గోష్టి, ఉత్సవ సమాప్తి గావింపబడును. వీరి వెంట డిఇఓ దోర్బల భాస్కరరావు, ఏఈఓ రఘు ఉన్నారు.

# నిత్య సేవకుడు మా మాస్టారు



నేరేడుచర్ల,మేజర్‌న్యూస్ః ఈ రోజుల్లో నేను, నా కుటుంబం అనే వ్యక్తిగత స్వార్థంతో నడుస్తున్న కలికాలంలో నేను నా చుట్టూ ఉన్న ప్రజలు అందరూ బాగుండాలి అందులో నేనుండాలి నాకు చేతనైన సహాయం అవసరమైన వారికి అందించేలా ప్రయత్నించాలి అప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు ప్రధానోపాధ్యాయులు బట్టు మధు.పట్టణానికి చెందిన మధు పేద కుటుంబంలో జన్మించిన చిన్న వయస్సు నుంచే చదువులో చురుకుదనం చూపిస్తూ సాంస్కృతి కార్యక్రమాలలో తనదైన పాత్ర పోషిస్తూ తోటి మిత్రులకు సహాయం చేస్తూ ఎదిగి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులుగా తాను చదువుకున్న పాఠశాల నేరేడుచర్లలో సేవలందిస్తూ, సామాజిక కార్యక్రమాలపై ఆసక్తితో అంతర్జాతీయ స్వచ్ఛంధ సంస్థ అయిన లయన్స్‌క్లబ్‌లో వివిధ హోదాలలో పనిచేస్తూ సేవే పరమావధిగా ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు సామాజిక బాధ్యతలు అడిగినవారికి కాదనకుండా నిరుపేదలకు తన వంతు సహకారంతో పాటు తన తోటి మిత్రులతో సహకారం అందిస్తూ , కళలపై మక్కువతో తన గాన మాధుర్యంతో వివిధ కార్యక్రమాల్లో ప్రదర్శిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తూ సామాజిక బాధ్యతను నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తున్న బట్టు మధును శభాష్ మాస్టారు అని ప్రజలు అభినందిస్తున్నారు.

# బిజెపికి నియోజకవర్గంలో పెరగని ఆదరణ

నేరేడుచర్ల,మేజర్‌న్యూస్ః హుజూర్‌నగర్ నియోజకవర్గంలో బిజెపి పార్టీకి ప్రజలలో ఆదరణ అంత ంత మాత్రంగానే ఉంది. ఒకప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టుల ప్రాభల్యం అధికంగా ఉండి కాంగ్రెస్‌తో గట్టి పోటీ ఇచ్చి నువ్వా నేనా అన్న పరిస్తితుల నుండి వివిధ పార్టీల ప్రాభల్యాలు పెరుగుతూ వచ్చినప్పటికి మతోన్మాద పార్టీగా ముద్రపడ్డ బిజెపి మాత్రం హుజూర్‌నగర్ నియోజకవ ర్గంలో ఒకప్పుడు మత ప్రాతిదికన అభిమానులు భారీగానే పెరిగిన సరైన లీడర్ లేక



పూర్తిస్థాయి కార్యకర్తగా అ భి ఎ ౕ న ౕ ు ల ు మారలేకపోయారు. గతంలో హుజూర్‌నగర్ నియోజకవర్గం నుండి టిఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందిన శానంపూడి సైదిరెడ్డి 2024 అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిజెపి పార్టీలో చేరి నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌ను, సరైన ఓటు బ్యాంకును రాబట్టుకోలేకపోయారు. అతనితో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు చల్లా శ్రీలతారెడ్డి బిజె పి పార్టీలో తన అన్న రాష్ట్ర నాయకుల సహకారంతో సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైనప్పటికి ఇటు నేరేడు చర్ల మండలంలో, స్థానిక హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పార్టీ ప్రాబల్యాన్ని పెంచడంలో పూర్తిగా విఫలమయ్యారని బిజెపి అభిమానులు విమర్శిస్తున్న పరిస్తితి. కమ్యూనిస్టు వారసత్వంతో మతతత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఈ ప్రాంతంలో మత ప్రాతిపదికనే ఏర్పడ భారతీయ జనతా పార్టీకి భవిష్యత్తు పెరగడం కష్టమేనని విశ్లేషకులు చెబుతున్నారు. నియోజకవర్గంలో గతంలో బొబ్బ భాగ్యారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన కొందరు జాతీయ, రాష్ట్ర స్థాయి పదవులు పొందినప్పటికి వారివారి పరిధిలకు మాత్రమే పరిమితమై కొత్త నాయకత్వాన్ని, కొత్త కార్యకర్తలను తీసుకరావడంలో సరియైన చొరవ చూపలేదని విమర్శలు ఉన్నాయి. జాతీయ స్థాయిలో గత మూడు పర్యాయాలుగా ప్రధానమంత్రిగా రాజ్యమేలుతున్న తెలంగాణ రాష్ట్రంలో అధికారం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మాత్రం పార్టీ ఎదుగుదలకు క్షేత్రస్థాయిలో చొరవ చూపకపోవడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు అనుభవించిన నాయకులు మాత్రం రాజధాని కేంద్రానికి పరిమితమవ్వడం, శుభ కార్యక్రమాలకు మాత్రమే హజరవుతూ ఉండటంతో పార్టీపై అభిమానంతో ఉన్న నాయకత్వం మొక్కుబడిగా అప్పుడప్పుడు కార్యక్రమాలు చేస్తూ సోషల్ మీడియాలో జాతీయ నాయకులు, కార్యక్రమాల పనితీరును ప్రచారం చేస్తూ ముందుకు సాగుతున్నారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రాన్ని బిజెపి పార్టీ అధికారం కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నప్పటికి ఇక్కడి పరిస్తితులు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఆ రకమైన ప్రయత్నాలు జరుగుతున్న లేదన్న విమర్శలు ఉన్న నేపథ్యంలో నియోజకవర్గంలోని నాయకులు ఏమేరా హుజూర్‌నగర్‌లో పార్టీని బలోపేతం చేస్తారో వేచి చూడాలి మరి.

# వైద్యం వికటించి ఏడు నెలల చిన్నారి మృతి



మిర్యాలగూడటౌన్,మేజర్‌న్యూస్ః పట్టణంలోని స్టార్ పిల్లల హాస్పటల్‌లో వైద్యం వికటించి ఏడు నెలల చిన్నారి మృతి చెందిన సంఘటన శుక్రవారం చటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం గారకుంట తండాకు చెందిన బానోతు శంకర్‌ధరణిలకు 7 నెలల బాబు లవ్యాన్ష్‌కు జ్వరం రావడంతో రెండురోజుల క్రితం స్టార్ పిల్లల హాస్పటల్ బండారి కుమార్ వద్దకు తీసుకరాగా వైద్య పరీక్షలు నిర్వహించి బాబును అడ్మిట్ చేసుకున్నారు. అదే రోజు రాత్రి బాబు తీవ్ర అస్వవస్థకు గురవుతున్నాడని కాంపౌండర్లు, డాక్టర్లకు తెలియజేసిన డాక్టర్ రాకపోవడం ఫోన్‌లో ద్వారా క ంపౌండర్లు మెడిసిన్ ఇవ్వాలని సూచించాడు. అయినప్పటికి బాబు చలనం లేకుండా ఉండటంతో వైద్య వికటించి నా కుమారుడు చనిపోయాడని బంధువులు హాస్పటల్ ముందు ఆందోళన నిర్వహించారు. మొదటి కాన్పులోనే పుట్టిన నా మనవడిని ఈ డాక్టర్ పొట్టన పెట్టుకున్నాడని బంధువులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులు హాస్పటల్ వద్దకు చేరుకుని ఆందోళనను విరమించారు.

# కృష్ణానదిలో ఈత నేర్చేకునేందుకు వెళ్లి విద్యార్థి మృతి

చింతలపాలెం,మేజర్‌న్యూస్ః వేసవి సెలవులు మొదలై పిల్లలు ఆటపాటలతో సరదాగా గడిపే సమయంలో మండలంలోని పులిచింతల ప్రాజెక్టు కాలనీ గ్రామంలో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల



ప్రకారం పది రోజుల క్రితం హస్టల్ నుండి ఇంటికి తిరిగొచ్చిన కొమ్ము లోకేష్ అనే విద్యార్థి ప్రమాదవశావత్తు కృష్ణానది నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. లోకేష్ తండ్రి వెంకటేశ్వర్లు వ్యవసాయ పనులు చేస్తుండగా లోకేష్ కాపుగల్లు హస్టల్‌లో ఉంటూ 8వ తరగతి పూర్తి చేశాడు. పరీక్షలు ముగినంతరం ఇంటికి వచ్చి స్నేహితులతో కలసి ఈత నేర్చుకోవాలన్న ఉద్దేశంతో కృష్ణానదికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో డబ్బా సాయంతో నేర్చుకునేందుకు ప్రయత్నించగా అది ఊడిపోవడంతో లోకేష్ నీటినిలో మునిగిపోయాడు. స్థానిక మత్స్యకారులు స్పందించి గాలింపు చర్యలు చేపట్టినప్పటికి అప్పటికే అతను మృతిచెందాడు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, బంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలి

తిరుమలగిరి మేజర్ న్యూస్ ః కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చి కార్మిక వర్గ ప్రయోజనాలను నష్ట పెట్టే నల్ల చట్టాలను రద్దు చేయాలని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కడెం లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడెం లింగయ్య హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకవచ్చి కార్మిక హక్కులను కాలరాయడం కోసం ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా నిత్యావసర సరుకులు, పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి మధ్య తరగతి కుటుంబాలపై భారం మోపుతున్నారని ఆరోపించారు. ఒకపక్క కార్మికులను రైతాంగాన్ని మోసం చేస్తూ అంబానీ అదానీలకు ఊడిగం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ మేడే స్ఫూర్తితో కార్మికులంతా ఏకమై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అనేక రంగాల కార్మికులు ఈ మేడే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మేడే స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాలు, పార్టీలు, ప్రజా సంఘాలు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలిశాల సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి చిత్తలూరు సోమయ్య, కడారి లింగయ్య, దుప్పటి రాములు, పల్లె కొమురయ్య, దుప్పటి లింగయ్య, సామనబోయిన లింగయ్య, సోమయ్య, ఏపూరి రామ్మూర్తి, దూపటి బక్కయ్య, ఏపూరి మహేష్, ఏపూరి ఐలయ్య, ఏపూరి ఎల్లయ్య, బహుజన కళాకారుడు ఏపూరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

నాగారం మేజర్ న్యూస్ ః నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రదానోపాధ్యాయురాలు జానకి మరియు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ వాసం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు ఈ శిక్షణ శిబిరం నిర్వహించబడుతుందని శిబిరంలో తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల లో శిక్షణ ఇవ్వబడును. గ్రామంలోని అన్ని తరగతుల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సెలవులు ఉన్నప్పటికి ప్రదానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం ఈ సమ్మర్ కోచింగ్ ప్రారంభించినందుకు వారిని అభినందించారు. పది ఫలితాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా చంద్రారెడ్డి నగర్ నుండి జడ్పిహెచ్ఎస్ డి.కొత్తపల్లి పాఠశాల వరకు వచ్చు విద్యార్థులందరికి విద్యా సంవత్సరం మొత్తం తన సొంత ఖర్చులతో ఆటో ఏర్పాటు చేస్తానని చెప్పినందుకు హెచ్ఎం జానకికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు తీర్చేందుకే భూ భారతి చట్టం

నాగారం మేజర్ న్యూస్ ః జిల్లా కలెక్టర్ సమాచార పౌర సంబంధాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి వచ్చిన భూభారతి చట్టంపై నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామంలో భూ రికార్డుల్లో తప్పుల సవరణకు ఏడాది వరకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సాంస్కృతిక సారధి సూర్యాపేట జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ తెలిపారు.

సూర్య


# మే 4న నీట్ ప్రవేశ పరీక్ష

## జిల్లాలో 7 పరీక్ష కేంద్రాలు

## జిల్లాలో 2087 అభ్యర్థులు

## నీట్ పరీక్షకు హాజరు కారున్నారు

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**నల్గొండ జిల్లా బ్యూరో**

మే 4న నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్) అండర్ గ్రాడ్యుయేషన్ -2025 ప్రవేశ పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ ) అండర్ గ్రాడ్యుయేషన్ -2025 ప్రవేశ పరీక్ష పై శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ నీట్ పరీక్షకు 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లాలో 2087 మంది అభ్యర్థులు నీట్ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. 7 పరీక్ష కేంద్రాలు నల్గొండ జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో 4 పరీక్ష కేంద్రాలు మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేయగా, ఎన్జీ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, కేంద్రీయ విద్యాలయాలలో 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. నీటి పరీక్ష రాసే అభ్యర్థులు ఒకరోజు ముందుగానే చూసుకోవాలని కోరారు. నీట్ - 2025 ప్రవేశ పరీక్ష మే 4న మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు ఉదయం 11 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు ఉన్నప్పటికీ బయోమెట్రిక్ అటెండెన్స్, తనిఖిని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు ఉదయం 11 కే చేరుకోవాలని, మధ్యాహ్నం 1.30 గంటలకు కచ్చితంగా పరీక్ష కేంద్రం గేట్లను మూసివేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఉన్న సూచనలన్నింటిని తు.చ తప్పకుండా పాటించాలని, ఇటీవలి పాస్ పోర్ట్ సైజ్ కలర్ ఫోటో ఒకటి, అలాగే 4 × 6 పోస్ట్ కార్డు సైజు కలర్ ఫోటోతో రావాలని తెలిపారు. గుర్తింపు కోసం డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డ్ లేదా కళాశాల జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా ఇతర ఏదో ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలని చెప్పారు. ముఖ్యంగా ఆభరణాలు, భారీ దుస్తులు, బూట్లు ధరించి పరీక్ష కేంద్రంలోకి రాకూడదని, పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని,అలాగే జామెట్రిక్ బాక్సులు, మొబైల్ ఫోన్, బ్లూటూత్, వాలెట్, రిస్ట్ వాచ్, కెమెరా, బెల్టు, గూగుల్స్, ఆహార పదార్థాలు, వాటర్ బాటిల్, పెన్, స్కేల్, రైటింగ్ ప్యాడ్, లాగ్ టేబుల్, క్యాలిక్యులేటర్లు అనుమతించడం జరగదని తెలిపారు. పెన్ను కూడా పరీక్ష కేంద్రంలోనే ఇవ్వడం జరుగుతుందన్నారు. నీట్ ప్రవేశ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు ఇదివరకే జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,ఈ సమావేశంలో విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించామని, అలాగే సీసీటీవీల ఏర్పాటు, పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ కేంద్రాల మూసివేత, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 163వ సెక్షన్ విధింపు, తాగునీరు, మెడికల్ కిట్, ఓఆర్ఎస్ పాకెట్ల ఏర్పాటు వంటి వాటిపై ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. నీట్ పరీక్షలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే అభ్యర్థులు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1442కు ఫోన్ చేయాలని ఆమె కోరారు. ఇన్చార్జ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ రాజకుమార్, నీట్ పరీక్ష నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

## తుమ్మల వీరారెడ్డి సీపీఐఎం జిల్లా ప్రధాన కార్యదర్శి



చిట్యాల, మేజర్‌న్యూస్ : ఎనిమిది గంటల పని దినాల కోసం ఎంతో మంది కార్మికులు ప్రాణ త్యాగం చేసిన ఫలితంగా సాధించిన పని గంటలను నేటి పాలకులు యాజమాన్యాలకు అనుకూలంగా చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాల మండలం చిన్న కాపర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి సిపిఎం ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి వీరారెడ్డి మాట్లాడారు. అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన రోజుకు ఎనిమిది గంటల పని దినాల మహత్తర పోరాటంలో ఎర్రజెండా పుట్టిన రోజును మేడేగా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నదని అన్నారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ఆ నిర్ణయాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. వారితో పాటు గ్రామ సెంటర్ లో ఏర్పాటు చేసిన సిపిఎం జెండాను ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, తుమ్మల పద్మ, మండల నాయకులు ఐతరాజు నర్సింహా, లడే రాములు, కోనేటి రాములు, ప్రజా నాట్య మండలి జిల్లా కమిటీ సభ్యురాలు విజయ, పార్టీ నాయకులు రూపని ఇద్దయ్య, శిరసు హన్మయ్య, గ్రామ శాఖ కార్యదర్శి వీరమళ్ళ వెంకటేశ్, సహాయ కార్యదర్శి దేశపాక సైదులు, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు పార్వతమ్మ, జయమ్మ, విష్ణుమూర్తి, గణేష్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు. ఉరుమడ్ల గ్రామంలో కూడా మేడే సందర్భంగా డప్పు వాయిద్యాలతో, కోలాట నృత్యాలతో ప్రదర్శన నిర్వహించి ఎర్రజెండా లను ఎగురవేశారు.

# చేనేతకు భరోసా కాంగ్రెస్ ప్రభుత్వం

## రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## చేనేత సదస్సులో పాల్గొన్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర చేనేత జోలి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య







భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో చేనేతకు భరోసాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని పద్మశాలి సభా వేదిక వద్ద భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన చేనేత ఇక్కత్ పై అవగాహన సదస్సు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ భూదానోద్యమానికి నాంది పలికి ప్రపంచ ప్రఖ్యాతగాంచిన చేనేత కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం నుండి చేనేత కార్మికులకు వచ్చే ప్రతి పథకాన్ని అమలు చేయాల్సిందిగా పోరాడుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను పట్టించుకోని 1000 కోట్లు కేటాయించిం దన్నారు. రాష్ట్రంలో రైతన్నలతో పాటు నేతన్నలుగా ఈ ప్రభుత్వం గుర్తించిందన్నారు. చేనేత అంటేనే పోచంపల్లి ఇక్కడ చేనేత కార్మికుల కోరుకున్నట్టుగాని అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సంవత్సరకాలంలో చేసిన వాగ్దానాలను అన్ని నెరవేర్చనున్నట్లు వారు తెలిపారు. కష్టాల్లో ఉన్న ప్రభుత్వం ఇది గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా వడ్డీ కడుతూ ఉన్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను నెరవేర్చే విధంగా ప్రయత్నిస్తున్నాం అని అన్నారు. పోచంపల్లి మండలంలో పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేస్తాం అని అన్నారు. చేనేత రంగాలను ప్రోత్సహించేందుకు 290 కోట్లు పొదుపు పథకం ద్వారా విడుదల చేయడం జరిగిందని 75 వేల నుండి 1.50 లక్షల వర కు రుణం పొందే అవకాశం ఉందన్నారు. చేనేత వస్త్రాలు డూప్లికేట్ రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు విద్యాశాఖ మహిళా శిశు సంక్షేమ శాఖల ద్వారా యూనిఫామ్స్ మెటీరియల్లు కొనుగోలు చేయిస్తామన్నారు. భూదాన్ పోచం పల్లి మున్సిపాలిటీగా ఏర్పడడం యునెస్కో వారిచే హెరిటేజ్ గ్రామంగా గుర్తింపు తెచ్చుకోవడం ఈ ప్రాంతం నేతన్న నెలవుగా మారిందన్నారు. ఉత్పత్తులు మార్కెటింగ్ చేపించేం దుకు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేపిస్తామన్నారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు రుణాలు అందించేటప్పుడు బంధువులుగా చూస్తూ సొంత సంస్థగా నడిపించినప్పుడే సహకార సంఘాలు బలపడతా యన్నారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చేనేత సంఘాలన్నీ కలిసి ఐక్యతతో నిలబడడం అభివృద్ధికి చిహ్నం అన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ పేరిట నెలకొల్పిన అవార్డ్లు కొనసాగిస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరుస్తామన్నారు. రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయర్ మాట్లాడుతూ పొదుపు పథకాలన్నీ అమల్లోకి తెస్తామన్నారు ఆర్డీలు కట్టిస్తామన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి 18 వేలు అనుబంధ కార్మికుడికి 6 వేలు జమ చేసే పద్ధతి వచ్చే నెల నుండి అమల్లోకి వస్తుందన్నారు. చేనేత వస్త్రాలైన బెడ్షీట్లు టవల్స్ లుంగీలు మార్కెటింగ్ చేసేందుకు ప్రోత్సాహకరంగా షో రూమ్లను ఏర్పాటుచేసి విక్రయానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా టెక్స్టైల్స్ డిప్లమా కోర్సులో 60 మంది అభ్యసిస్తున్నారని తెలియజేశారు. గతంలో 57 సంవత్సరంల వారికే బీమావర్తించేదని, ప్రస్తుత ప్రభుత్వం వయసుతో నిమిత్తం లేకుండా వృద్ధులైన వారికి ఐదు లక్షల బీమాను వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేశం, రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు మురళి మదన్ గోపాల్ స్వామి, భువనగిరి మార్కెట్ చైర్మన్ రేఖ బాబురావు, గర్దాసు, బాలయ్య, ఆర్డీవో శేఖర్ రెడ్డి, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు భారత లవ కుమార్, గుజ్జ సత్యనారాయణ, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.